క్లుప్తంగా

దివ్యాంగ పింఛన్ల వెరిఫికేషన్



కృత్తివెన్ను: దివ్యాంగ పింఛన్ల వెరిఫికేషన్ ప్రక్రియను మండలంలోని గ్రామాల్లో సోమవారం నిర్వహించారు. డాక్టర్ సాయిసందీప్ తెలిపిన వివరాల ప్రకారం బెడ్‌రీడెన్ పేషెంట్స్, పెరాలసిస్ రోగులు, యాక్సిడెంట్లతో బెడ్‌మీద ఉన్న పేషెంట్లను వారి నివాసాల వద్ద పరిశీలించినట్లు తెలిపారు. వీరికి ప్రభుత్వం నెలకు రూ.15,000 ఫించన్‌గా అందిస్తుంది. మండలంలో 14 మందిని సర్వే చేసినట్లు ఆయన వివరించారు. ఈ పరిశీలనలో గుంటూరు నుంచి వచ్చిన ప్రత్యేక వైద్యుల బృందంతో పాటు, స్థానిక సచివాలయ ఉద్యోగులు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

స్నానఘాట్ల వద్ద బుసక మేట తొలగింపు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లి స్నానఘాట్ల వద్ద మేట వేసిన బుసకను పొక్లయిన్ సాయంతో తొలగించారు. సర్పంచ్ అరజా సంధ్యారాణి మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 26న పెద్ద ఎత్తున భక్తులు పుణ్యస్నానాలకు పలుప్రాంతాల నుంచి తరలి వస్తారని తెలిపారు. దీని దృష్ట్యా మొత్తం నాలుగు ఘాట్ల వద్ద మేట వేసిన బుసకను తొలగించినట్లు తెలిపారు. వృద్ధులు, పిల్లలను దృష్టిలో ఉంచుకుని గతంలో నది ఒడ్డున జల్లు స్నానం చేయడానికి ఏర్పాటు చేసిన పైప్‌లైన్ శిథిలావస్థలో ఉందని, దాన్ని కూడా అధికారులు పునరుద్ధరించాలని కోరారు. వెంకటాపురం నుంచి పెదకళ్లేపల్లి జెడ్పీ రోడ్డుకు కనీస మరమ్మతులు చేపట్టి భక్తుల వాహనాలకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు.

ఘనంగా అచలేశ్వర ప్రతిష్ఠా మహోత్సవాలు



చల్లపల్లి: పాగోలు కైవల్యాశ్రమ చలాచలబోధోపదేశ మందిరంలో నిర్వహించిన కమలాత్మిక సహిత అచలేశ్వర ప్రతిష్ఠా మహోత్సవాలు సోమవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన వడ్లమాని సుబ్రహ్మణ్య అవధాని, కేదార శర్మల ఆధ్వర్యంలో 36 మంది పురోహితులతో పూజా కార్యక్రమాలు జరిపించారు. ఆశ్రమ ట్రస్టీ మేకా సత్యనారాయణప్రసాద్ (బంగారుబాబు) దంపతులు, మేనేజింగ్ ట్రస్టీ చాపరాల గాంధీ ప్రసాద్ దంపతులు, సెటిలర్ వక్కలగడ్డ దుర్గాప్రసాద్ దంపతులు పూజలు నిర్వహించారు.

అగస్త్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



బంటుమిల్లి: పెదతుమ్మిడి గ్రామంలోని శ్రీ పార్వతి సమేత అగస్త్యేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలు సోమవారం వైభవంగా ముగిశాయి. ఉదయం స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు పండితుడు సోమరాజుపల్లి ఈశ్వరశర్మ శిష్య బృందం ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా జరుగుతున్న రుద్రహోమానికి పూర్ణాహుతి చేశారు. ఈ సందర్భంగా పలువురు దంపతులకు, భక్తులకు త్రిశూలస్నానం చేయించారు. రాత్రి ద్వాదశ ప్రదక్షిణలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు చైర్‌పర్సన్ మట్టా విజయలక్ష్మి, అభివృద్ధి కమిటీ చైర్మన్ మట్టా నాగబాబు, ఆలయ ఫౌండర్ ట్రస్టీ లక్కాప్రగడ మాధవరావు, కోశాధికారి జల్లూరి శరభయ్య గుప్త, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయుడికి వెండి కిరీటం



అవనిగడ్డ: స్థానిక వంతెన సెంటర్‌లోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయానికి అవనిగడ్డకు చెందిన సింహాద్రి భవన్నారాయణ, రాజ్యలక్ష్మి దంపతులు రూ.70 వేల విలువైన వెండి కిరీటాన్ని బహూకరించారు. ఆలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో భవన్నారాయణ దంపతులు, ఆయన కుమారుడు సాహితీచంద్ర ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. తొలుత ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ కమిటీకి కిరీటాన్ని అందజేశారు. కార్యక్రమంలో బడే దానారావు, గంగు దేవరాజు, వడ్డి రవీంద్రతో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మూణ్నాళ్ల ముచ్చటే..



విశ్వనాథపల్లి సమీపంలో రోడ్డుపై గోతులు



నారేపాలెం వద్ద మరమ్మతు చేసిన రోడ్డు కుంగిపోయింది

- మరమ్మతులకు రూ.6.97 కోట్లు
- వారం రోజులకే దెబ్బతిన్న రోడ్లు
- నారేపాలెం వద్ద మూడు రోజులకే కుంగింది
- సంక్రాంతికి పూర్తి చేస్తామన్నారు
- ఇంకా కొన్నిచోట్ల ప్రారంభం కాలేదు



నారేపాలెం - విశ్వనాథపల్లి మధ్య ఇలా

అవనిగడ్డ: గుంతల రహిత రహదారుల పనులు మూణ్నాళ్ల ముచ్చటగానే మారాయి. అవనిగడ్డ నియోజకవర్గంలో పలుచోట్ల రోడ్లకు మరమ్మత్తులు చేయగా మూడోరోజే దెబ్బతిన్నాయి. మరికొన్నిచోట్ల కుంగిపోయాయి. దీంతో కోట్లాది రూపాయల వ్యయంతో చేపట్టిన మరమ్మతులతో వాహనచోదకులకు మళ్లీ రహదారుల కష్టాలు తప్పేట్టు లేవు.

రెండు విడతలుగా రూ.6.97 కోట్లు

నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రహదారుల మరమ్మతులకు రెండు విడతలుగా రూ.6.97 కోట్లు మంజూరు చేశారు. తొలివిడతగా ఏడు పనులకు రూ.1.80 కోట్లు మంజూరు చేయగా, రెండో విడతగా రూ.5.17 కోట్లు మంజూరు చేశారు. ఇంకేముంది రహదారులన్నింటికీ మోక్షం కలిగిందని స్థానిక ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ చెప్పుకొచ్చారు. సంక్రాంతిలోపు పూర్తి చేస్తామని ప్రకటించారు. జనవరి వెళ్లి ఫిబ్రవరి వచ్చినా కొన్నిచోట్ల ఇంకా పనులు ప్రారంభం కాలేదు.

పనుల్లో డొల్లతనం

కొన్నిచోట్ల రహదారులకు చేపట్టిన మరమ్మతుల్లో డొల్లతనం బయట పడింది. కోడూరు మండలం విశ్వనాథపల్లి నుంచి నారేపాలెం వరకూ చేపట్టిన మరమ్మతులు కొన్నిచోట్ల అప్పుడే దెబ్బతిన్నాయి. నారేపాలెం పుట్ట ప్రాంతం వద్ద మరమ్మతులు చేస్తే మూడో రోజుకే రోడ్డు కుంగిపోయింది. కొన్నిచోట్ల రోడ్డుపై రాళ్లు తేలి, గుంతలుపడిన దారులు కనపడుతున్నాయి. నారేపాలెం విశ్వనాథపల్లి మధ్య కిలోమీటర్ దూరం వదిలేసి విశ్వనాథపల్లి నుంచి వి.కొత్తపాలెం మధ్య మరమ్మతులు చేశారు. గోతులు పూడ్చని చోట రహదారులు అధ్వానంగా కనిపిస్తున్నాయి.

పనుల్లో జాప్యం

సంక్రాంతి నాటికి రహదారులన్నింటికీ మరమ్మతులు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ చెప్పారు. దీనిపై ఇప్పటికి ఐదు సార్లు అధికారులతో సమీక్ష చేశారు. పనులు జాప్యమవుతుండటంతో హెచ్చరించారు. అయినా కొన్నిచోట్ల పనులు ప్రారంభం కాలేదు. మోపిదేవి నుంచి కోసూరువారిపాలెం రోడ్లు పనులు ఇంతవరకూ ప్రారంభించలేదు. కొన్ని రోడ్లు గోతుల్లో కంకర రాళ్లతో నింపి వదిలేశారు. రాళ్లు పైకిలేచి ద్విచక్ర వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

పెడనలో పట్టభద్రుల ఓటర్లు 4,476 మంది

నాలుగు పోలింగ్ స్టేషన్లు.. ఆరు బూత్‌ల ఏర్పాటు



ఎమ్మెల్సీ ఎన్నికకు పెడనలో ఏర్పాటుచేసిన పోలింగ్‌కేంద్రం

పెడన: కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 27న జరగనున్న పోలింగ్‌కు సంబంధించి పెడన నియోజకవర్గంలో పట్టభద్రుల ఓటర్లు 4,476 మంది ఉన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో నాలుగు పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. పెడన, బంటుమిల్లి మండలల్లో రెండు చొప్పున పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయగా కృత్తివెన్ను, గూడూరు మండలాల్లో ఒక్కో బూత్‌ను ఏర్పాటు చేశారు. పెడన మండలంలో 1,390 మంది, బంటుమిల్లిలో 1,321 మంది, గూడూరులో 950, కృత్తివెన్ను మండలంలో 815 మంది ఓటర్లు ఉన్నారు. పెడనలో భట్టజ్ఞానకోటయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ స్టేషన్‌లో రెండు బూత్‌లను ఏర్పాటు చేశారు. బంటుమిల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్ స్టేషన్‌లో రెండు బూత్‌లను, గూడూరు మండలంలో గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో, కృత్తివెన్ను మండలం సంగమూడి జెడ్పీహెచ్ఎస్‌లోను ఒక్కో బూత్ చొప్పున ఏర్పాటు చేశారు.

ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్



ఈ నెల 27న ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. సాయంత్రం నాలుగు గంటల వరకు కొనసాగుతుంది. బ్యాలెట్ పేపర్లు ద్వారా ఓటు వేయాల్సి ఉంటుంది. ఓటర్లను చైతన్య పరచడానికి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం. ఓటర్లకు స్లిప్పులను బీఎల్‌వోల ద్వారా అందించడానికి చర్యలు తీసుకుంటున్నాం.

–కె.అనిల్‌కుమార్, ఇన్‌చార్జి తహసీల్దార్, పెడన

పాడి రైతులకు అండగా ఉంటాం

విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు



రైతులను సన్మానిస్తున్న ఆంజనేయులు, పాలకేంద్రం సభ్యులు

చిట్టూర్పు(ఘంటసాల): పాడి రైతులకు మరింత అండగా ఉంటామని విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. ఘంటసాల మండలం చిట్టూర్పు పాలకేంద్రం వద్ద విజయ సంస్థ వజ్రోత్సవాన్ని పాలకేంద్రం ప్రెసిడెంట్ దాసరి శివ వెంకట సుబ్బయ్య ఆధ్వర్యాన సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఆంజనేయులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. విజయ సంస్థ 60 ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో ఆటుపోట్లు తట్టుకుని సహకార వ్యవస్థలో దేశంలోనే అగ్రగామిగా నిలిచిందన్నారు. రైతులు, వినియోగదారుల నమ్మకం నిలబెట్టుకుంటూ ఉద్యోగుల సహకారంతో రాబోయే రోజుల్లో మరిన్ని మెరుగైన ఫలితాలు సాధిస్తామన్నారు. అనంతరం పాలకేంద్రంలో మూడు తరాలుగా పాలు సరఫరా చేస్తున్న రైతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విజయ డెయిరీ బోర్డు సభ్యుడు వేమూరి సాయి వెంకటరమణ, పామర్రు మేనేజర్ గోపీనాథ్ సూపర్‌వైజర్ సురేష్, పాలకేంద్రం కార్యదర్శి పీవీ నరసింహారావు, దాసరి కుటుంబరావు, పిడికిటి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి ఇల్లు దగ్ధం

గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారని ఆరోపణ



దగ్ధమైన ఇంటిని పరిశీలిస్తున్న ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు

ఘంటసాలపాలెం(ఘంటసాల): గుర్తు తెలియని వ్యక్తులు ఉపాధ్యాయుడి ఒంటి నిట్టాడి ఇంటికి నిప్పు పెట్టిన ఘటన ఘంటసాల మండలం ఘంటసాలపాలెం చాట్రగడ్డవానిగూడెంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం ఘంటసాలపాలెం చాట్రగడ్డవానిగూడెంలోని సీబీసీఎన్‌సీ స్కూల్లో ప్రధానోపాధ్యాయుడిగా చేస్తున్న కొమ్ముకూరి సాల్మన్ రాజు స్కూల్ పక్కనే ఒంటి నిట్టాడి ఇంటిలో నివసిస్తున్నాడు. ఆదివారం సెలవు కావడంతో విజయవాడలోని పిల్లల వద్దకు వెళ్లారు. ఇంటిలో మాస్టారు లేని సమయంలో ఆదివారం అర్ధరాత్రి సుమారు ఒంటి గంట దాటిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు ఇంటికి నిప్పు పెట్టినట్లు ఆరోపించారు. భారీ మంటలకు పెద్ద పెద్ద శబ్దాలు రావడంతో గ్రామస్తులు చూసి మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించినా ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ప్రమాద సమయంలో గాలి లేకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు. అగ్ని ప్రమాదంతో ఉపాధ్యాయుడి వంటసామగ్రి, సైకిలు, విద్యా సామగ్రి, సుమారు రూ.లక్ష విలువైన వస్తువులు కాలిపోయినట్లు అధికారులు ధ్రువీకరించారు. స్థానికులు మొవ్వ ఫైర్ స్టేషన్‌కు సోమవారం సమాచారం అందించగా ఫైర్ ఆఫీసర్ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా ఆర్పివేశారు. అగ్ని ప్రమాదం జరిగిన ఇంటిని ఆనుకుని చెరోవైపున ఉన్న స్కూల్, చర్చిలోకి మంటలు వ్యాపించకపోవడం, సమీపంలోని గడ్డివామి, చావిళ్లకు అంటుకోకపోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న ఆర్ఐ కె.శ్రీనివాస్, వీఆర్వో వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి బి.అర్జునరావు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడు సాల్మన్‌రాజుతో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురు వ్యక్తులు ప్రమాదానికి కారణమని ఆరోపిస్తూ ఘంటసాల పీఎస్‌లో హెచ్ఎం సాల్మన్ రాజు సోమవారం రాత్రి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

- చాట్రగడ్డవానిగూడెంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఉపాధ్యాయుడు కె.సాల్మన్‌రాజు ఒంటి నిట్టాడి ఇల్లు దగ్ధమైన ఘటనపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు చల్లపల్లి సీఐ ఈశ్వరరావు సోమవారం రాత్రి ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ఆయన ఫిర్యాదులో తెలిపిన అనుమానితులతో మాట్లాడి, పరిసర ప్రాంతాల ప్రజలను విచారణ చేశారు.

స్వచ్ఛ గ్రామాలే.. కార్యదర్శుల లక్ష్యం



పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశంలో డీపీఓ జె.అరుణ

గూడూరు: స్వచ్ఛ గ్రామాలే కార్యదర్శుల లక్ష్యమని జిల్లా పంచాయతీ అధికారి జె.అరుణ కోరారు. గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో నిర్మించిన చెత్త సంపద కేంద్రాలను నిరుపయోగంగా వదిలేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వాటిని వినియోగంలోకి తీసుకురావడంలో కార్యదర్శులు చొరవ తీసుకోవాలని కోరారు. ప్రజల నుంచి తడి, పొడి చెత్తను విడివిడిగా సేకరించి ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఆదాయ వనరులుగా మలుచుకోవాలని సూచించారు. మంగళవారం నుంచి మండలంలోని గ్రామాల్లో తాను స్వయంగా పర్యటించి క్షేత్రస్థాయిలో పరిస్థితులు సమీక్షిస్తానని ఆమె స్పష్టం చేశారు. వేసవి రద్దీ దృష్ట్యా నీటి ఇక్కట్లు రాకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ వి.సీతారామయ్య, ఇన్‌చార్జి ఎంపీడీఓ బి.రాజేశ్వరి, వివిధ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

23 నుంచి మహాశివరాత్రి మహోత్సవాలు



పెదకళ్లేపల్లిలో ఉత్సవాల వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆలయ అధికారులు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): దక్షిణకాశీ పెదకళ్లేపల్లిలోని శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామిఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 23 నుంచి మార్చి 3వ తేదీ వరకు శివరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ డీసీ దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. సోమవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో వాల్‌పోస్టర్లు, ఉత్సవాల బుక్ లెట్‌ను ఆవిష్కరించారు. అనంతరం డీసీ మాట్లాడుతూ మహాశివరాత్రికి ఇక్కడ ఉత్తరవాహినిగా ప్రవహిస్తున్న కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివార్లను దర్శించుకుంటే పుణ్యఫలం లభిస్తుందని తెలిపారు. ఈ నెల 23వ తేదీ ఉదయం 10.30 గంటలకు స్వామివారిని పెండ్లి కుమారుని అలంకరిస్తారని చెప్పారు. 26 మహాశివరాత్రి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో రాత్రి 7 గంటలకు జగజ్యోతి, రాత్రి 1 గంటలకు ఎదురుకోలు ఉత్సవం, తెల్లవారుజాము 2 గంటలకు శ్రీస్వామివారి దివ్యకళ్యాణోత్సవం నిర్వహించి, 5 గంటలకు గ్రామోత్సవం ఉంటుందని తెలిపారు. ప్రత్యేక పూజలు జరుగుతాయని చెప్పారు.

బీసీ సంక్షేమ సంఘ నగర కమిటీ నియామకం



నూతన కమిటీకి నియామకపత్రాలు అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ

మచిలీపట్నంటౌన్: బీసీ సంక్షేమ సంఘం మచిలీపట్నం నగర నూతన కమిటీని ఆ సంఘ కృష్ణా జిల్లా అధ్యక్షుడు కుక్కల వీరవెంకటసత్యనారాయణ సోమవారం నియమించారు. స్థానిక సంఘ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో నగర కమిటీని నియమించి వారికి ఆయన నియామక పత్రాలను అందజేశారు. బీసీ సంక్షేమ సంఘం మచిలీపట్నం నగర అధ్యక్షుడిగా ఎస్‌కే జానీబాష, ఉపాధ్యక్షుడిగా బొర్రా ప్రవీణ్, జాయింట్ సెక్రటరీగా ఎస్కే నాగుల్ మీరా, సెక్రటరీగా కందిమూళ్ల రాము, నగర మహిళా విభాగ అధ్యక్షురాలిగా తిలకచూరి నాగ శిరీషను సత్యనారాయణ నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో కృష్ణా జిల్లా బీసీ సంక్షేమ సంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. సమావేశంలో సంఘ నేతలు వరద వెంకటేశ్వరరావు, బొల్లం వెంకటేశ్వరరావు, రాగి చంద్రశేఖర్, సి.రాజ్యలక్ష్మి, దేవిక ఆదిలక్ష్మి, నీరజ, వసంత, ఎద్దు లక్ష్మణ్(సీమ), కొండ, పరస సురేష్, జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు. నూతన కమిటీని పలువురు అభినందించారు.

బాధితుడికి బంగారు గొలుసు అందజేత



కోనేరుసెంటర్: కారును వాష్ చేయిస్తూ ఓ బాధితుడు బంగారు గొలుసును పోగొట్టుకున్నాడు. అదే రోజు బాధితుడు జరిగిన ఘటనపై చిలకలపూడి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు 24 గంటల వ్యవధిలో పోయిన బంగారు గొలుసును గుర్తించి తిరిగి బాధితుడికి అందజేశారు. ఆకునూరి కోటేశ్వరరావు అనే వ్యక్తి ఆదివారం గాంధీనగర్‌లోని ఓ కారు సర్వీసింగ్ సెంటర్లో కారును వాష్ చేయిస్తుండగా మెడలోని బంగారు గొలుసు జారి పడిపోయింది. పోయిన ప్రదేశంలో బాధితుడు ఎంత వెదికినా గొలుసు కనిపించలేదు. దీనిపై బాధితుడు అదే రోజు చిలకలపూడి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విషయం తెలుసుకున్న సీఐ ఎస్ కే నభి కారు సర్వీసింగ్ సెంటర్‌కు వెళ్లి అక్కడ సీసీ ఫుటేజీలను పరిశీలించారు. గొలుసు కనిపిస్తే తమకు తెలియజేయాలని సిబ్బందికి చెప్పి వెళ్లిపోయారు. మరుసటి రోజు సర్వీసింగ్ సెంటర్లో పనిచేసే సిబ్బంది గొలుసు దొరికిందంటూ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న సీఐ.. పోయిన గొలుసును స్వాధీనం చేసుకుని సోమవారం ఆకునూరి కోటేశ్వరరావుకు అందజేశారు.

ఎన్నికల సిబ్బంది ఇచ్చిన పెన్నుతోనే ఓటు వేయాలి

అవనిగడ్డ నియోజకవర్గ ఎన్నికల డీటీ శ్రీనివాసరావు



అధికారులు, ఉపాధ్యాయుల ర్యాలీ

చల్లపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ స్టేషన్లలో సిబ్బంది ఇచ్చిన పెన్నుతోనే తమకు నచ్చిన అభ్యర్థి పేరు ఎదురుగా బ్యాలెట్ పేపర్‌పై ఓటు నమోదు చేయాలని అవనిగడ్డ నియోజకవర్గ ఎన్నికల డీటీ ఎ.శ్రీనివాసరావు సూచించారు. చల్లపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చల్లపల్లి మండలంలో మొత్తం ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్గిన ఓటర్లు 2,024 మంది ఉన్నట్లు తెలిపారు. ఎస్ఆర్‌వైఎస్‌పీ స్కూల్ ఆవరణలో 189, 190 పోలింగ్ కేంద్రాల్లో బూత్‌లు ఏర్పాటుచేసినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం కార్యాలయం బయట మార్గంలో ర్యాలీ నిర్వహించారు.

తెలుగురావుపాలెం(ఘంటసాల): సామాజిక చైతన్యం, పోటీలో ఉన్న అభ్యర్థులపై పూర్తి అవగాహన కలిగి పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్ బాబు అన్నారు. ఘంటసాల మండలంలోని తెలుగురావుపాలెం, ఇతర సచివాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసే విధానం, కౌంటింగ్ ప్రక్రియ పై అసోసియేషన్ ముద్రించిన కరపత్రాలను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు బీజే అశ్విన్ కుమార్, కొడాలి శివకృష్ణ, బెల్లంకొండ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధతో ఉజ్వల భవిత



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ భవానీశంకర్

మచిలీపట్నంటౌన్: విద్యార్థులు కృత్రిమ మేధతో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేస్తే ఉజ్వల భవితను సొంతం చేసుకోవచ్చని కృష్ణా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.భవానిశంకర్ అన్నారు. స్థానిక పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలో సైన్స్ అండ్ టెక్నాలజీ ఇంజినీరింగ్, గణితం (ఎస్‌టీఈఎం) కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల్లో వివిధ రకాల నైపుణ్యాలను పెంపొందించడానికి సోమవారం ఆయన అతిథి ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా కృత్రిమ మేధ, మిషన్ లెర్నింగ్ తదితర విభాగాల్లో ఇంజినీరింగ్ పూరి చేస్తే వచ్చే అవకాశాలను వివరించారు. ప్రిన్సిపాల్ మహమ్మద్ ఆసిఫ్ హుస్సేన్ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో పీజీటీలు వీహెచ్ కేకే గుప్తా, బి.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

గుడివాడరూరల్: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు యెండూరి గీత, టి.వాణి కోరారు. స్థానిక శిశు సంక్షేమ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలకు వేతనాలు, గ్రాట్యూటీ, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీఓ విడుదల చేయాలని తదితర డిమాండ్‌లతో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వం 11 సంవత్సరాల పాలనలో అంగన్‌వాడీ వర్కర్లకు ఎలాంటి జీత భత్యాలు పెంచలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆర్‌సీపీ రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు అమ్మాజీ, రమాదేవి, నిర్మల జ్యోతి, మేరీకుమారి, సుగుణ, వెంకటేశ్వరమ్మ, విజయలక్ష్మి త్రివేణి పాల్గొన్నారు.

దేవాంగ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా రత్నం




గూడూరు: రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా పోలవరం గ్రామానికి చెందిన కారుపర్తి రత్నం నియమితులయ్యారు. పోలవరం మాజీ సర్పంచి రత్నం విజయవాడలో జరిగిన దేవాంగ రాష్ట్ర సంక్షేమ సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో బాధ్యతలు స్వీకరించారు. ఆమెను పలువురు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే

మచిలీపట్నంటౌన్: నగరంలో ఈ నెల 18వ తేదీ మంగళవారం విద్యుత్ లైన్ల మరమ్మతులు చేస్తున్నందున పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ జి.గోవిందరావు సోమవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 7 నుంచి 9 గంటల వరకు చల్లస్తా సెంటర్, చమ్మనగిరిపేట, బలరామునిపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలకు గూడూరు పీడీ



గూడూరు: రాష్ట్రస్థాయిలో జరిగిన అథ్లెటిక్ పోటీల్లో సత్తాచాటిన గూడూరు ఫిజికల్ డైరెక్టర్ మత్తి అరుణ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆలిండియా సివిల్ సర్వీసెస్ కల్చరల్ అండ్ స్పోర్ట్స్ ఈనెల 19 నుంచి 21 వరకు చండీగఢ్‌లో జరగనున్నాయి. అథ్లెటిక్ విభాగంలో ఆమె ఏపీ తరఫున బరిలోకి దిగనున్నారు. జాతీయ స్థాయిలో జరుగుతున్న పోటీల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న ఏకైక క్రీడాకారిణి మత్తి అరుణ అని పాఠశాల ప్రధానోపాధ్యాయిని డి.పుష్పలత తెలిపారు. ఆమెను సోమవారం పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

చిన్నారికి ఆర్థిక సాయం

మోపిదేవి: మోపిదేవి కాలనీకి చెందిన పెంట్ర నాగలక్ష్మణ మణికుమార్, ఝాన్సీ దంపతులకు పాప జన్మించింది. పాపకు అనారోగ్యం. దీంతో పలువురు దాతలు పాపకు వైద్యం చేయించడానికి తమవంతు సాయం అందిస్తున్నారు. నాగాయలంక మండలం రేమాలపాలెంకు చెందిన వితరణశీలి చెన్ను రంగారావు తన వంతు సాయంగా సోమవారం రూ. 5 వేలు స్థానిక ఎస్ఐ సత్యనారాయణ చేతుల మీదుగా పోలీస్ స్టేషన్‌లో అందజేశారు.